ఇప్పటికే భారం.. ఇకపై అదనం!

రొయ్యల మేత ధర పెంపునకు కంపెనీల సన్నాహాలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

రొయ్యల మేత ధరలు వరుస పెంపుతో ఆక్వా రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు మరోసారి పెంచేందుకు కంపెనీల నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఫలితంగా మరోసారి పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సంవత్సరం ఇప్పటికే రెండుసార్లు ధరలు పెంచారు. వనామీ రకం కిలో మేత ధర రూ.90-103 మధ్య ఉండగా.. టైగర్ రకం రూ.105-112గా ఉంది. ముడిసరకుల ధరలు పెరగడంతో పాటు ఇతర దేశాల నుంచి దిగుమతి సుంకం ఎక్కువైందని కంపెనీలు చెబుతున్నాయి. దీన్ని సాకుగా చూపి జనవరి నెలలో కిలోకు రూ.4, మే నెలలో రూ.10 పెంచాయి. సాగుదారుల ఆందోళనతో కిలోకు రూ.4లు తగ్గించాలని ప్రభుత్వం సంప్రదింపులు జరిపినా.. కేవలం రూ.2లు తగ్గించి చేతులు దులుపుకొన్నాయి. ఇది చాలదన్నట్లు మళ్లీ పెంచడానికి ఫీడ్ కంపెనీలు చర్యలు చేపట్టడంపై ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రైతులకు నష్టాలు

ఈ ఏడాది సాగు ప్రారంభంలో టైగర్ 30 కౌంట్ ధర రూ.520, అదే 29 కౌంట్ అయితే రూ.620గా ఉంది. ఇప్పుడు అది కాస్తా రూ.450, రూ.600లకు తగ్గింది. దీంతో నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని కంపెనీలు ఉపసంహరించుకునేలా చూడాలని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


రొయ్యల మేత బస్తాలు

సాగు వ్యయం పైపైకి..

జిల్లావ్యాప్తంగా 23,868 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. ఒక్కో చెరువులో సరాసరి లక్ష రొయ్యల పిల్లలు వదులుతున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో నెలకొన్న మార్పులతో చెరువుకు వంద కిలోల మేత వరకు అందిస్తున్నారు. జిల్లాలోని 9,550 చెరువుల్లో రోజుకు వంద కిలోల వంతున అంటే 9.55 లక్షల కిలోల మేత వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కిలో మేత ధర రూ.125గా ఉంది. రోజుకు మేత కోసం రూ.11,93,75,000 ఖర్చుచేస్తున్నారు. ఇప్పుడు కంపెనీలు కిలోకు రూ.14లు పెంచాలనే ఆలోచనలో ఉన్నాయి. అదే జరిగితే కిలో మేత రూ.139 వరకు పెరిగే అవకాశం ఉంది. తద్వారా సాగు వ్యయం పెరిగిపోతుందని ఆక్వా రైతులు అంటున్నారు. ఈ మేరకు మార్కెట్లో రొయ్యల ధరలు పెరిగే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరందదు.. వరి ఎదగదు

కృష్ణా పశ్చిమ డెల్టాపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం

బాపట్ల, న్యూస్‌టుడే

కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి సాగుపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆగస్టు ముగుస్తున్నా నలభై శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు జరిగింది. పైర్లు ఎండిపోకుండా కాపాడుకోవటానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాలువల్లో నుంచి ట్రాక్టర్, డీజిల్ ఇంజిన్లతో నీరు తోడి తడులు ఇస్తున్నారు. నీరందక వరి పైరు సరిగా ఎదగడం లేదు.

నరసాయపాలెం వద్ద నల్లమడ లాకులు మూసివేసి దిగువనున్న పర్చూరు, చీరాల నియోజక వర్గాలకు నీరివ్వడం లేదు. చీరాల సబ్ డివిజన్‌లో లక్ష ఎకరాల ఆయకట్టు ఉండగా.. వెయ్యి ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేపట్టారు. సాగునీరందే పరిస్థితులు లేకపోవడంతో రైతులు వేచి చూస్తున్నారు.


జమ్ములపాలెంలో వరి పైరు ఇలా..

ఖరీఫ్‌లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం: 1,01,000 హెక్టార్లు
ఇప్పటి వరకు సాగైంది : 40 వేల హెక్టార్లు
జులైలో సాధారణ వర్షపాతం: 122.8 మి.మీ.
కురిసింది: 45.3 మి.మీ.
ఆగస్టులో సాధారణ వర్షపాతం: 157.9 మి.మీ.
ఇప్పటి వరకు కురిసింది: 56.1 మి.మీ.

ప్రకాశం బ్యారేజీ నుంచి కేడబ్ల్యూడీ ప్రధాన కాలువకు 4012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అందులో నుంచి కొమ్మమూరు కాలువకు 975, రేపల్లె బ్యాంక్ కెనాల్‌కు 1178, నిజాంపట్నం ఛానల్‌కు 310, పశ్చిమ కాలువకు 230, తూర్పు కాలువకు 390 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. 60 నుంచి 70 శాతం నీటిని ఎగువ ఆయకట్టులోని గుంటూరు జిల్లా రైతులు వినియోగిస్తున్నారు.

ఇంజిన్లతో నీటిని తోడుతూ..

జిల్లా పరిధిలోకి వచ్చేసరికి కొమ్మమూరు కాలువకు 178 క్యూసెక్కుల నీరే వస్తోంది. ఆ నీటిని పూండ్ల, పీటీ, బాపట్ల ఛానల్స్‌కు వదులుతున్నారు. ఈ కాలువల్లోని నీటిని ఇంజిన్ల ద్వారా తోడి పొలాలకు మరలించి, వరి పైరు ఎండిపోకుండా సాగుదారులు ప్రయత్నిస్తున్నారు. చివరి ఆయకట్టులోని కర్లపాలెం మండల తీర గ్రామాలకు నీరందక వరిపైరు ఎండిపోతోంది.

➾ వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో కాలువల వెంబడి భూముల రైతులు మోటార్లతో నీటిని తోడి పోస్తూ వరిని గట్టెక్కించడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన కాలువలో నుంచి పంట కాలువకు, అక్కడి నుంచి పొలంలోని నీటిని తోడిపోయడానికి రెండు ఇంజిన్లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఎకరా పైరుకు ఒకసారి తడి ఇవ్వడానికి రూ.వెయ్యికి పైగా ఖర్చవుతోంది. వేడి వాతావరణంతో ప్రతివారం తడి ఇవ్వాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. సెప్టెంబరు, అక్టోబరులోనైనా వర్షాలు కురిస్తేనే వేల ఎకరాల్లో వరి పైరు బతికి పంట చేతికి వస్తుంది.

చీరాల చిన్నోడు.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరిశాడు

చీరాల, న్యూస్‌టుడే: చీరాలకు చెందిన గొర్ల పూర్ణస్వామి ఇటీవల తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి అందరి మన్ననలు పొందాడు. తోటవారిపాలెం సాయి విద్యా కేంద్రంలో పదో తరగతి చదువుతున్న ఇతను రెండేళ్లుగా ఈపూరుపాలెంలో గోపీ వద్ద శిక్షణ పొందుతున్నాడు. తండ్రి నరేంద్ర గుమస్తాగా పనిచేస్తుంటారు. మొదటి నుంచీ క్రీడలపై ఉత్సాహం చూపుతుండటంతో ఆయన కుమారుడిని ప్రోత్సహించారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా స్వామి క్రీడల్లోనూ రాణిస్తున్నాడు.


తిరుపతిలో పూర్ణస్వామి ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం.. రెండేళ్ల కిందట రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల్లో షాట్‌పుట్‌లో రజత, డిస్క్‌స్‌లో కాంస్య పతకాలు సాధించి సత్తా చాటాడు. తాజాగా జరిగిన అమరావతి క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో 17 సంవత్సరాల్లోపు 70 కేజీల విభాగంలో బరిలోకి దిగి జిల్లా, జోనల్ స్థాయిలో బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. చివరగా తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్నాచ్‌లో 85, క్లీన్‌అండ్‌జర్క్‌లో 107 కేజీల బరువు ఎత్తి ఎదురులేని విజయం సాధించి బంగారు పతకం అందుకున్నాడు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడలపై దృష్టి పెట్టానని బంగారు పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని పూర్ణస్వామి తెలిపాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

స్వచ్ఛత.. పరిశుభ్రత

గ్రామ పంచాయతీల మధ్య పోటీ

బాపట్ల, సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా మార్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. గత రెండేళ్లలో పల్లెల్లో ఘనవ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టికి అత్యంత ప్రాధాన్యమిచ్చాయి. ప్లాస్టిక్‌ను తరిమేసేందుకు స్వచ్ఛరథాల్ని తీసుకొచ్చాయి. అయినా గ్రామాల్లో అపరిశుభ్రత, అధ్వాన పారిశుద్ధ్యం కనిపిస్తూనే ఉంది. స్వచ్ఛతలో గ్రామ పంచాయతీల మధ్య పోటీతో పల్లెటూళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2026 పేరుతో పోటీకి శ్రీకారం చుట్టింది. ❖ స్వచ్ఛత కార్యక్రమాల సమర్థ నిర్వహణను ప్రధాన అంశంగా తీసుకుని పోటీ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 358 గ్రామ పంచాయతీల మధ్య ఈ పోటీ ఉండనుంది. ఇప్పటికే దీనిపై మండల, గ్రామ స్థాయి అధికారులకు మార్గదర్శకాలందాయి. రెండు విభాగాల్లో పోటీ ఉంటుంది.


ఇలా పరిశుభ్రంగా ఉంటే అవార్డుల్లో ప్రాధాన్యం

అంశాలివి.. ఇలా..

❖ స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో రాష్ట్రస్థాయి ఆరు, జిల్లాస్థాయి ఐదు అవార్డులు ఇవ్వనున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల శుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ, సేంద్రియ వ్యర్థాల నిర్వహణ, తోటల పెంపకం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటారు.

❖ తొలిసారి స్వచ్ఛ దూతలకు (పారిశుద్ధ్య కార్మికులు) కూడా పోటీలో పాల్గొనే అవకాశం కల్పించారు. వీరికి రాష్ట్రస్థాయిలో మూడు, జిల్లాస్థాయిలో ఐదు అవార్డులు ఇవ్వనున్నారు. విధులపై శ్రద్ధ, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణలో ఆదర్శ పద్ధతులు, వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించడం, బాధ్యతగా పని చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆన్‌లైన్‌లో కార్మికులు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి బృందాలు వారి పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదర్శ కార్మికులను ఎంపిక చేస్తాయి. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని డీపీవో ప్రభాకరరావు నాయక్ తెలిపారు.

త్వరలో సొంతింటి కల సాకారం!

15,247 మంది లబ్ధిదారుల గుర్తింపు

బాపట్ల, న్యూస్‌టుడే

సొంతింటి నిర్మాణం ప్రతి ఒక్కరి కల. గ్రామాల్లో పక్కాఇళ్లు నిర్మించుకోవడానికి ఎదురుచూస్తున్న వేల మంది పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఇప్పటికే సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించింది. అతి త్వరలో వీరికి గృహ నిర్మాణ అనుమతి పత్రాలు జారీ చేసి ఆర్థిక సాయం విడుదల చేయనుంది.

❖ గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చినా పక్కా గృహాలు మంజూరు చేయలేదు. ఐదేళ్ల కాలం గడిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని 20 మండలాల నుంచి వేల దరఖాస్తులు రాగా.. వాటిని విచారించి అర్హుల్ని ఎంపికచేశారు. దరఖాస్తుదారుల్లో 99 శాతం మంది అర్హులున్నారు. 88 శాతం మందికి సొంత స్థలాలున్నాయి. ప్రభుత్వం గృహ నిర్మాణానికి అనుమతి ఇచ్చే వెంటనే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు.

రూ.2.39 లక్షల సాయం

పీఎంఏవై 2.0 గ్రామీణ్ కింద గృహ నిర్మాణం చేపట్టేవారికి రూ.2.39 లక్షల సాయం చేయడానికి ప్రతిపాదనలు రూపొందించారు. కేంద్ర వాటా కింద రూ.78 వేలు, రాష్ట్ర వాటా కింద రూ.42 వేలు కలిపి రూ.1.20 లక్షలు, స్వయం సహాయక సంఘాలకు రూ.80 వేలు బ్యాంకుల నుంచి సాయం, వీబీ జీ రామ్‌జీ కింద రూ.27 వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఐహెచ్‌ఎల్ నుంచి రూ.12 వేల చొప్పున ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పేదలకు గృహాల మంజూరుపై ప్రభుత్వ ప్రకటన కోసం గత ఏప్రిల్ నుంచి పేదలు వేచిచూస్తున్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో పక్కా గృహాలు కేటాయించింది. తద్వారా ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమమైంది. సెప్టెంబరు మొదటి వారంలో ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయనున్నారు.

❖ దరఖాస్తులు ఇచ్చిన వారిలో అర్హులైన లబ్ధిదారులు:	పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద వచ్చిన దరఖాస్తులు:	అనర్హులుగా తేలినవారు: 311
15,247	15,558	అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులు: 15,247

పీఎంఏవై 2.0 గ్రామీణ్ కింద అనుమతి

❖ జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె పట్టణాల్లో పీఎంఏవై అర్బన్ కింద స్థలాలు ఉన్నవారికి గృహాలు మంజూరు చేస్తున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.రెండున్నర లక్షల సాయం చేస్తున్నాయి. ప్రస్తుతం మూడు పట్టణాల్లో 770 పక్కా గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు రాగానే గ్రామాల్లో లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరుపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. పట్టణాల్లో మాత్రం స్థలం ఉండి దరఖాస్తు చేసుకున్నవారికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గాల వారీగా..

పేరు	సంఖ్య
బాపట్ల	1742
చీరాల	1829
పర్చూరు	6025
రేపల్లె	3676
వేమూరు	1975


ఇళ్ల స్థలాలు లేనివారు: 1352

దరఖాస్తుదారును విచారిస్తున్న పీడీ వెంకటేశ్వర్లు

జొన్న సాగే ప్రత్యామ్నాయం

బాపట్ల, న్యూస్‌టుడే: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా పశ్చిమ డెల్టాలో వరికి ప్రత్యామ్నాయంగా అన్నదాతలు జొన్న సాగు చేపట్టాలని బాపట్ల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.అచ్యుతరాజు సూచించారు. సెప్టెంబరు నుంచి వరి సాగు వద్దన్నారు. ఇప్పటి వరకు సాగు చేసిన వరి పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఎల్‌నినో కారణంగా లోటు వర్షపాతం, సాగునీటి సమస్యల నేపథ్యంలో తక్కువ నీటితో అన్నదాతలు చేపట్టాల్సిన పంటల సాగుపై ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు.. ఆయన మాటల్లో..

జిల్లాలో మొత్తం 1.01 లక్షల హెక్టార్లకు గాను ఇప్పటి వరకు 40 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఈసారి వెద విధానంలో 35 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. 3,700 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేయగలిగారు. డెల్టాలో సెప్టెంబరు ఒకటి నుంచి వరి నాట్లు వేయరాదు. ఇంజిన్లతో నీటిని తోడి నాట్లు వేసినా తర్వాత చిగురు దశలో నీరు అందించలేకపోతే దిగుబడులు బాగా తగ్గిపోతాయి. వరి సాగు చేసి నష్టపోరాదు. ఒకవేళ సాగు ప్రారంభించినా రెండో పంటను వేసే అవకాశాన్ని కోల్పోతారు. రబీ సాగుకు తగినంత సమయం ఉండదు.


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అచ్యుతరాజు

సెప్టెంబరు నుంచి వరి సాగు వద్దు

పైరు ఎండిపోకుండా చూడాలి

ఎల్‌నినో కారణంగా ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. తెల్లవారుజామున చిరుజల్లులు కురుస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వేడి గాలులకు పైరు ఎండుముఖం పడుతోంది. తేమ త్వరగా ఆరిపోకుండా పైరును కాపాడుకోవడానికి పొటాషియం నైట్రేట్ 19:19:19 లేదా మల్టీకే ఐదు గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే వారం, పది రోజుల వరకు తేమ ఉండి పైరు ఎండిపోదు.

ఆరుతడి పంటలు మేలు

సెప్టెంబరు నుంచి తెల్లజొన్న, పచ్చజొన్న సాగుకు రైతులు సిద్ధం కావాలి. దీనికి ఒక తడి సరిపోతుంది. కాలువల ద్వారా సులభంగా అందించొచ్చు. ఓ మోస్తరు వర్షం కురిసినా సరిపోతుంది. తెల్లజొన్నకు మార్కెట్లో డిమాండ్ ఉంది. పంటకు మంచి ధర లభిస్తోంది. పెసర, ఉలవలు, కూరగాయలు, గోరు చిక్కుడు, దోస, బెండకాయ, ఆకుకూరలు సాగు చేయాలి. మొక్కజొన్నను మాత్రం పండించవద్దు. దీనిని అవసరమైన సాగునీరు అందే పరిస్థితి లేదు.

కలుపు సమస్య ఎక్కువ

బెట్ట వాతావరణ పరిస్థితుల్లో వరిలో కలుపు సమస్య ఎక్కువగా వస్తుంది. మందులు చల్లే ముందు పొలంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. కలుపు నివారణకు రెండాకుల దశలో నామిని గోల్డ్ లేదా కౌన్సిల్ యాక్టివ్ మందులు ఎకరాకు వంద మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి. 25-30 రోజుల మధ్య ఉన్న కలుపు నివారణకు ఆల్‌మిక్స్ లేదా ఫెర్నాక్సీజోన్(24డి) పిచికారీ చేయాలి. రైతులు తాము వేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి.

అభ్యంతరాలపై విచారణ ప్రారంభం

బాపట్ల, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నిమిత్తం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. రిజర్వుడు ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లాయని ఫిర్యాదులు అందాయి. పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయి. దీనిపై తొమ్మిది మండలాల నుంచి 286 అభ్యంతరాలు వచ్చిన విషయం తెలిసిందే. ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు ఆదివారం ఇంటింటికీ వెళ్లి జాబితాలో పేరు లేని రిజర్వుడు కేటగిరీల ఓటర్లను విచారించారు. బాపట్ల మండలం జమ్ములపాలెంలో 56 అభ్యంతరాలు రాగా ఎంపీడీవో బాబూరావు, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ ఆదివారం ఓటర్ల వద్దకు వెళ్లి విచారణ జరిపారు. కంకటపాలెంలో 13, మూలపాలెంలో 11, మర్రిపూడిలో ఐదు చొప్పున మొత్తం 85 అభ్యంతరాలొచ్చాయి. వీటిపై విచారణకు గ్రామస్థాయి కమిటీలను నియమించారు. కారంచేడు, చినగంజాం, వేమూరు, అమృతలూరు, ఇంకొల్లు, పర్చూరు, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. సెప్టెంబరు 3 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. గ్రామసభలు నిర్వహించి విచారణ చేపట్టి, పొరపాటున గల్లంతైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చనున్నారు. సెప్టెంబరు 7న దోషరహితంగా తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు.


జమ్ములపాలెం గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సెప్టెంబరు ఒకటి నుంచి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సైదమ్మబాయ్ తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని, తొలిరోజు స్వామి వారి దర్శనం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రహదారికి పచ్చని సొబగులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చెన్నై - కోల్‌కత్తా 16వ నంబరు జాతీయ రహదారిలో భాగంగా రామచంద్రాపురం అడ్డరోడ్డు నుంచి తిమ్మాపురం వరకు 16.384 కి.మీ. చిలకలూరిపేట బైపాస్ వెంబడి మొక్కల పెంపకం ప్రత్యేక గుర్తింపు పొందింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) గ్రీన్ హైవేస్ ఎక్సలెన్స్ అవార్డు కింద అమరావతి ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పరిధిలోకి వచ్చే చిలకలూరిపేట బైపాస్‌కు జాతీయస్థాయిలో మొదటి బహుమతి లభించింది. ప్రాజెక్టు కేవలం రహదారి నిర్మాణానికి పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగా చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రథమ బహుమతిని సాధించింది.


చిలకలూరిపేట బైపాస్ కూడలి వద్ద పచ్చదనం

చిలకలూరిపేట బైపాస్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంతో బాధ్యతగా చేపట్టారు. ఎవెన్యూ ప్లాంటేషన్ అనేది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం కాదు. అది సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగం. భద్రత, పర్యావరణం, సౌందర్యం అనే అంశాలను సమన్వయం చేస్తూ చిలకలూరిపేట జాతీయరహదారిని గ్రీన్ కారిడార్‌గా మార్చారు. చెట్ల ఎంపికలోనూ నేల స్వభావం, వర్షపాతం, ఉష్ణోగ్రతకు తగిన జాతుల మొక్కలను ఎంపిక చేశారు. వేప, గానుగ, చింత, తెల్ల బంగారం, కొండచింత, తెల్లమద్ది, రేల తదితరాలతో పాటు పూల మొక్కలు, అందంగా ఉండే గడ్డి మొక్కలతో బైపాస్ ప్రారంభం నుంచి చివరి వరకు తీర్చిదిద్దారు. ఎడమ వైపున 970, కుడి వైపున 4075.. మొత్తం 5051 మొక్కలు నాటి రహదారికి ఇరువైపులా పచ్చదనాన్ని పరిఢవిల్లేలా చేశారు. కడియం వద్ద నర్సరీలో రెండేళ్లు పెరిగిన మొక్కలు తీసుకొచ్చి నాటడంతో త్వరితగతిన పచ్చదనం పరచుకుంది. ప్రతి మొక్కకు ఐరన్ ట్రీ-గార్డు ఏర్పాటు చేశారు. సర్వీసు రోడ్డు పక్కన పశువుల నుంచి రక్షణకు ప్రత్యేక కంచె నిర్మించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

వేటపాలెం, న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మొత్తం 496 మంది విద్యార్థులకుగాను 472 మంది హాజరైనట్లు కళాశాల ప్రధానాచార్యుడు కె.జగదీష్‌బాబు చెప్పారు. విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.


పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

అటో.. ఇటో.. ఎటో..

ఈనాడు, అమరావతి: రైల్వేశాఖలోని సాంకేతిక లోపాలు.. సిబ్బంది అలసత్వం ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. కాచిగూడ-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు (17625/17646) విషయంలో గందరగోళం మంచి ఉదాహరణ.

కోచ్‌ల పొజిషన్ సరిగా చూపక.. ప్రయాణికుల పరుగులు

సమస్య ఏమిటంటే...

కాచిగూడ నుంచి రాత్రి సమయంలో రేపల్లెకు వచ్చే డెల్టా ఎక్స్‌ప్రెస్ (17625) తిరిగి పగటిపూట రేపల్లె నుంచి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (17646)గా బయల్దేరుతుంది. ఇది గమ్యస్థానానికి చేరాక లోకో/రేక్ రివర్సల్ జరుగుతుంది. ఫలితంగా రాత్రి వచ్చిన రైలు పగటు వెళ్లేటప్పుడు కోచ్‌ల వరుసక్రమం మారుతుంది. ఈ మార్పులకు తగిన విధంగా నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ (ఎన్‌టీఈఎస్) యాప్‌లోనూ, స్టేషన్‌లోని కోచ్ పొజిషన్ బోర్డులపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కానీ.. రైల్వే సిబ్బంది సమాచారాన్ని సరిగ్గా అప్‌డేట్ చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ఉరుకులు పరుగులు

ఎన్‌టీఈఎస్ యాప్, ప్లాట్‌ఫారమ్ బోర్డుల్లో సమాచారాన్ని నమ్మి ప్రయాణికులు వారి కోచ్‌ల నంబర్లు బట్టి వేచి ఉంటున్నారు. తీరా రైలొచ్చాక చూస్తే అవి ఎక్కడో దూరంగా ఉంటున్నాయి. వారి బెర్తులు ఉన్న కోచ్‌ల వద్దకు పరుగెత్తలేక వృద్ధులు, మహిళలు, పిల్లలు అవస్థ పడుతున్నారు. ఈ లోపాలపై గుంటూరు డివిజనల్ రైల్ యూజర్స్ అసోసియేషన్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఎక్స్ వేదికగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీలకు అవకాశం

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్లో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీలు అందజేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, www.meekosam.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలిచ్చిన అర్జీలు ఇప్పటివరకు పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. నడవలేని, మంచాలకు పరిమితమై అనారోగ్యంతో బాధపడుతున్న వారిని తీసుకురావద్దన్నారు. వారికి బదులుగా కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు వచ్చి సమస్యపై అర్జీలు ఇవ్వాలని సూచించారు.





(c) eenadu

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత


గ్రామస్థులు అడ్డుకున్న ఇసుక టిప్పర్లు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధి తులసీనగర్‌లో ఆదివారం గ్రామస్థులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. శనివారం రాత్రి నుంచి కొందరు ఒక పొక్లెయిన్, రెండు టిప్పర్ల సాయంతో ఇసుక తరలిస్తుండగా గమనించిన స్థానికులు ఉదయాన్నే అక్కడికి చేరుకుని టిప్పర్లను అడ్డుకున్నారు. బాపట్ల రెవెన్యూ అధికారుల కోసం ఇసుక తరలిస్తున్నామని అందుకు తమకు అనుమతులు ఉన్నాయని రవాణాదారులు వాదించారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిలో ఇసుక తరలించే అధికారం ఎవరికీ లేదని బదులిచ్చారు. అనంతరం చీరాల అధికారులకు సమాచారం అందించగా తహసీల్దార్ గోపీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రవాణాదారుల వద్ద ఉన్న అనుమతి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల అధికారులకు ఫోన్ చేసి వాకబు చేశారు. మరోసారి ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పి వాటిని అక్కడ నుంచి పంపించివేశారు. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల గ్రామానికి ముప్పు పొంచి ఉందని జిల్లా అధికారులు బాపట్ల, చీరాల సరిహద్దుల్లో ఉన్న అసైన్డ్ భూములను కాపాడాలని స్థానికులు కోరారు.

టెట్ రద్దు చేసే వరకు పోరాటం


ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: టెట్ పరీక్షను ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అన్నారు. టెట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం నిరసన చేపట్టారు. పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన నిర్వహించారు. టెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయాలన్నారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులు టెట్ రాయాల్సిన అవసరం లేకుండా ఆర్డినెన్స్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలన్నారు. నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాస్, సాంబశివరావు, మీనా, బాబూజీ రెడ్డి, విజయకుమార్, పోలీసురావు, మాధవరావు, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ


మాట్లాడుతున్న అమరావతి జేఏసీ జిల్లా ఛైర్మన్ సురేష్‌బాబు

బాపట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ నోటీసును కలెక్టర్‌కు అందజేస్తామని అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సత్వరమే కొత్త పీఆర్సీ ప్రకటించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోశాధికారి ఓంకార్, బీటీ వలి, మహిళా కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ రాణి, నేతలు శ్రీకాంత్, శ్రీనివాసరావు, మహబూబ్‌బాషా, సుమంత్ రాజ్, రమేష్, హాజీరా బేగం, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఉచితంగా మోటార్ల పంపిణీ


మోటార్లు అందుకున్న రైతులు

బాపట్ల, న్యూస్‌టుడే: ఎలిసెల్ ప్రభావంతో లోటు వర్షపాతం ఉన్న పరిస్థితుల్లో కాలువల నుంచి నీటిని తోడి పంటలు సాగు చేసుకునేందుకు గుడిపూడికి చెందిన రైతులకు రూ.4 లక్షల విలువైన 3 హెచ్‌పీ విద్యుత్తు మోటార్లను హైదరాబాద్‌కు చెందిన వాటర్ లిఫ్ట్ హ్యాండ్ ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ డైరెక్టర్ డా.రామ్మోహనరావు అందజేశారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు గరికిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫౌండేషన్ చేసిన సాయం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పంటలు ఎండిపోకుండా సకాలంలో నీటిని తోడి, తడులు ఇవ్వటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మాజీ సర్పంచి హనుమాన్, తెదేపా నేతలు, రైతులు గరికిపాటి గోపి, గూడూరు నాగరాజు, గరికిపాటి మాధవరావు, నువ్వుల ప్రసాద్, దబ్బు కాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక వనాలే శరణ్యం

మడ మొక్కల పెంపకంతో తీరానికి రక్షణ

పర్యావరణ సమతుల్యత ఉండాలంటే 33.33 శాతం విస్తీర్ణంలో అడవులు ఉండాలి. జిల్లాలో కేవలం 11 శాతం భూ విస్తీర్ణంలో మాత్రమే ఉన్నాయి. అటవీ సాంద్రత అతి తక్కువ. తీర ప్రాంతానికి సహజ రక్షక కవచమైన మడ అడవులను కొందరు స్వార్థం కోసం ధ్వంసం చేస్తున్నారు. అటవీ ప్రాంతాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. సామాజిక, మడ అడవుల అభివృద్ధి ద్వారా పచ్చదనాన్ని పెంచితేనే కాలుష్యానికి అడ్డుకట్ట వేయగలమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

– బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలోని తీర ప్రాంతంలో నాలుగున్నర వేల ఎకరాల్లో మడ అడవులు, అరవై వేల ఎకరాల్లో అటవీ భూములు ఉన్నాయి. నిజాంపట్నం మండలం దిండి, రేపల్లె మండలం లంకెవానిదిబ్బ, కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, చినగంజాం మండలాల్లో మడ అడవులను అక్రమంగా నరికివేసి రొయ్యల చెరువులుగా మార్చారు. చినగంజాం తీరంలో ఇటీవల ప్రైవేటు వ్యక్తులు మడ అడవులను ధ్వంసం చేశారు. పర్యాటక రంగాభివృద్ధికి తీర ప్రాంత భూములు కొన్ని కట్టబెట్టారు. అటవీ, సముద్ర తీర భూముల్ని ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారు. తీర ప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) నిబంధనల ఉల్లంఘన జరుగుతోంది.


ముత్తాయపాలెం-ఎ బీటీలో అడవి

★ మడ అడవుల ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ శాఖ ద్వారా వీటి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాయి. సూర్యలంకలో మడ నర్సరీలు పెంచి 50 హెక్టార్లలో మొక్కలు నాటి, విస్తీర్ణం పెంచటానికి కృషి చేస్తున్నారు. గతంలో నిజాంపట్నంలో 40 హెక్టార్లలో మడ అడవులు పెంచారు. ఐటీసీ సంస్థ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా వీటి అభివృద్ధిలో భాగస్వామిగా చేరింది.

★ గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా చినగంజాం మండలం పల్లెపాలెం, బాపట్ల మండలం సూర్యలంక, నిజాంపట్నంలో మడమొక్కల పెంపకం ప్రాజెక్టు చేపట్టి అసంపూర్తిగా ఆపివేశారు. దీన్ని తిరిగి పునరుద్ధరించాల్సి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో సూర్యలంకలో వంద ఎకరాల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఏపీ పేరుతో ఆలీ, ఈత చెట్లు పెంచుతున్నారు. తీరంలో మడ అడవులు దట్టంగా ఉంటే తుపానులు, వాయుగుండాల సమయంలో గాలుల తీవ్రతను తగ్గిస్తాయి. తీర ప్రాంతం కోతకు గురికాకుండా నిరోధిస్తాయి.

★ 216 ఏ జాతీయ రహదారి విస్తరణలో 672 భారీ వృక్షాలు తొలగించారు. వాటిస్థానంలో కొత్తగా మొక్కలు నాటి పెంచటాన్ని మరిచారు. అటవీ, బంజరు భూముల్లో సామాజిక వనాలు పెద్ద ఎత్తున పెంచితే పచ్చదనం వృద్ధి చెందుతుంది. అటవీ విస్తీర్ణం పెరుగుతుంది. ఏటా ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో నాలుగు లక్షలకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్ణయించినా చేరుకోలేదు. లక్ష్యంగా, రెండు లక్షల మొక్కలు నాటినా సంరక్షణ లేక 70 శాతం ఎండిపోతున్నాయి. దీనివల్ల పచ్చదనం ఆశించిన స్థాయిలో పెరగటం లేదు. ఏటా ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతోంది. ఓ ప్రణాళిక ప్రకారం జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

సర్ విచారణ వేగవంతం చేయండి


పెదగంజాంలో దస్త్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పెదగంజాం (చినగంజాం) న్యూస్‌టుడే: పెదగంజాంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. పెదగంజాం 303 పోలింగ్ కేంద్రంతో పాటు మరో రెండు కేంద్రాలను పరిశీలించారు. సర్ విచారణ కార్యక్రమాన్ని బీఎల్‌వోలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బాపట్లకు తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో చీరాల ఆర్‌డీవో నరసింహారావు, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు మండల పరిషత్ ఏవో పూర్ణచంద్రరావు బీఎల్‌వోలు అనిల్, హిమబిందు పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు చీరాల ఆర్డీవో నరసింహారావు, రాజుబంగారుపాలెం, చినగంజాంలో సర్‌కు సంబంధించి విచారించారు.

ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు ముగిసిన గడువు


ఇస్లాంపేట పోలింగ్‌బూత్‌లో ఓటరు నుంచి ధ్రువపత్రం తీసుకుంటున్న ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణారెడ్డి

బాపట్ల, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా అధికారులు ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు గడువు ఆదివారంతో ముగిసింది. మొత్తం 1367 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కేంద్రాల్లో బీఎల్వోలు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉన్నారు. ఓటు హక్కు కోసం చివరి రోజూ ఫారం-6 దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. చిరునామాలో మార్పులు, ఇంటి, ఓటర్ల పేరులో తప్పులు సరిదిద్దటానికి ఫారం-8 దరఖాస్తులు అందజేశారు. సర్ ప్రక్రియ చేపట్టిన అనంతరం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 9,41,264 మంది ఓటర్లు ఉన్నారు. అంతకుముందు జిల్లాలో 10,50,605 మంది ఓటర్లు ఉండేవారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో మృతులు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీలకు సంబంధించి 1,10,216 మంది ఓటర్లను తొలగించారు. మ్యాపింగ్ జరగని, ఎన్యూమరేషన్ ఫారాల్లో తప్పులు ఉన్న అనామలిస్ జాబితాలో ఉన్న 1,59,116 మంది ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు 65 వేల మందిని విచారించి ధ్రువపత్రాలను ఈసీఐ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, పురపాలక కమిషనర్లు, బీఎల్వోలు నోటీసులు అందుకున్న ఓటర్లను విచారించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనంగా ఏఈఆర్వోలను నియమించి, వారికి కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. నోటీసుల విచారణ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పెండింగ్ ఎక్కువ ఉన్న మండలాలు, గ్రామాల అధికారులు, బీఎల్వోలతో మాట్లాడి వేగవంతం చేయిస్తున్నారు. జిల్లా కేంద్రం బాపట్లలో ఇన్‌ఛార్జి కమిషనర్ కృష్ణారెడ్డి, మండలంలో తహసీల్దారు సలీమా నోటీసులు అందుకున్న ఓటర్లను విచారించి వారి నుంచి ధ్రువపత్రాలు తీసుకున్నారు. నోటీసుల విచారణను సెప్టెంబరు 28 నాటికి పూర్తి చేయనున్నారు. అక్టోబరు 3న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు దుర్మరణం


నాగమహేష్ (పాత చిత్రం)

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పెళ్లయిన ఆరు నెలలకే రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతిచెందిన విషాద సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. శుభకార్యానికి హాజరైన వారిని తన ఆటోలో క్షేమంగా వారి గమ్యస్థానానికి చేర్చి, తిరిగి ఇంటికి వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో చెట్టును ఢీకొట్టి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రేపల్లె 21వ వార్డులో నివసిస్తున్న యేమినేని నాగమహేష్(30) ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. ఇతనికి భార్య వెంకటశివలక్ష్మి ఉన్నారు. ఈనెల 29న సాయంత్రం రేపల్లె మండలం బండికాయలమోటు నుంచి ఆటోలో ప్రయాణికులను తెనాలి మండలం చలపాడు గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యక్రమానికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి వారిని బండికాయలమోటు గ్రామానికి వేకువజామున క్షేమంగా తీసుకొచ్చారు. బండికాయలమోటు నుంచి తిరిగి రేపల్లెకు బయల్దేరి ఉదయం సుమారు ఏడు గంటలకు పెనుమూడి సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి, రోడ్డు మధ్యలో ఉన్న చెట్టును ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమహేష్ అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గమనించిన బాటసారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, బంధువులు నాగమహేష్ మృతదేహాన్ని పట్టణ ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించారు. భార్య వెంకటశివలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇక రోజూ పీజీఆర్ఎస్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో నిర్వహణ

పిట్టలవానిపాలెం, చందోలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజలకు మరింత చేరువయ్యేలా స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాల్లో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఇకపై స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ నిర్వహించనుంది. ఇక సమస్యలపై వినతులు ఇచ్చేందుకు సోమవారం వరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బంది వినతులు తీసుకుని, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. జిల్లాలో 477 స్వర్ణ, వార్డు కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,620 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఉదయం వేళల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్తుండటంతో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కార్యాలయాల్లో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను రోజూ విధిగా నిర్వహించాలని ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని విభాగాల సిబ్బంది విధిగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి. గ్రామ స్థాయిలో సమస్యలపై వినతులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తే ప్రభుత్వ సేవల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, పురపాలక, నగర పాలక కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

ఇక 24 గంటల్లోనే కొత్త వాహనాలకు నంబరు

మార్టూరు, జాండ్రపేట, ముంతావారి సెంటర్(చీరాల అర్బన్), న్యూస్‌టుడే

అమల్లోకి వచ్చిన నూతన విధానం

కొత్త వాహనం కొనుగోలు చేసిన తరువాత రిజిస్ట్రేషన్ అయినప్పటికీ నంబరు రావడానికి కనీసం పది రోజుల నుంచి నెల వరకు సమయం పట్టేది. ఇక నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానంతో వాహనం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే నంబరు సైతం కేటాయిస్తారు. అధికారులు కావాలని కాలయాపన చేయడానికి కూడా ఇందులో ఎటువంటి అవకాశం ఉండదు. వాహనాల రిజిస్ట్రేషన్ అంటే దళారులను ఆశ్రయిస్తే తప్ప పని పూర్తి కాని కాదనే విమర్శలు ఉండేవి.

అక్రమాలకు చెక్.. తాజాగా ప్రభుత్వం వీటికి చెక్ పెట్టడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటల్ విధానం ద్వారా సులభతరం చేసింది. నంబరు ప్రక్రియను సంబంధిత డీలర్ స్థాయిలోనే కొనసాగిస్తోంది. కొనుగోలు చేసిన తరువాత వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలను డీలరు రవాణా శాఖ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపిస్తారు. అదే రోజు అధికారులు వాటిని పరిశీలించి నంబరు సైతం కేటాయించనున్నారు.

జాప్యానికి వీల్లేదు..

పత్రాల పరిశీలన, నంబరు కేటాయింపులో రవాణా శాఖ అధికారులు జాప్యం చేయడానికి ఇకపై వీలుండదు. కార్యాలయంలో ఆలస్యం చేసినా 24 గంటలు దాటిన తరువాత నంబరు అలాట్ అయితే వాహనదారుడికి ఆ సమాచారం చేరుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరంపై అటు డీలర్లు, ఇటు వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాహనం రిజిస్ట్రేషన్‌తో పాటు నంబరు కేటాయింపు కేవలం ఒక్క రోజులో పూర్తి కావడం శుభపరిణామని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో వాహనదారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. డీలర్ అన్ని పత్రాలను పంపుతారని, అవి సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి పూర్తి చేయడం జరుగుతోందని చెబుతున్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఆదివారం విజయవాడలోని ఏఐటీయూసీ భవనంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. రాష్ట్ర కమిటీలో నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో వార్డు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఇద్దరికి చోటుదక్కింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ అలీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ కరీముల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు వారు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్ కృష్ణ, జనరల్ సెక్రటరీగా బి.ఆర్.ఆర్ కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భార్గవ్ సుతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతన రాష్ట్ర కార్యవర్గం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు కృషి చేస్తుందన్నారు.

చేపల వేటకు తాత్కాలిక విరామం


హార్బర్‌కు చేరిన బోట్లు

సముద్రంలో తాత్కాలికంగా చేపల వేట నిలిచింది. మత్స్యకారులు ఏటా శ్రావణ మాసంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహించడమే ఇందుకు కారణం. ఉత్సవాల అనంతరం మళ్లీ వేటకు వెళతారు. ఈక్రమంలో శనివారం సాయంత్రానికే వేటకు వెళ్లిన బోట్లన్నీ నిజాంపట్నం హార్బర్‌కు చేరాయి. మూడు నెలల పాటు బోట్ల యజమానులు, కార్మికుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు చూసుకుంటారు. తర్వాత మళ్లీ సంక్రాంతికి చూసుకుంటామని మత్స్య కార్మికులు తెలిపారు. - **న్యూస్‌టుడే, నిజాంపట్నం**

గూడ్స్ రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

నరసరావుపేట, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం సాతులూరు - నరసరావుపేట రైల్వేస్టేషన్ల మధ్య 43వ కిలోమీటర్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు ఆదివారం మృతిచెందాడు. మృతుడికి 20 నుంచి 25 సంవత్సరాలు ఉండవచ్చునని, తెలుపు రంగు టీషర్ట్, లేత నీలి రంగు నిక్కరు ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే ఎస్సై 9247585720 సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న గణిత విజ్ఞాన మేళా


ప్రదర్శనను ప్రారంభిస్తున్న తెదేపా నేత శివప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె 12వ వార్డులోని రామకృష్ణ విద్యా నిలయంలో ఆదివారం శ్రీసరస్వతి విద్యా పీఠం విజయవాడ సమితి ఆధ్వర్యంలో గణిత విజ్ఞాన మేళా సంస్కృతి మహోత్సవం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పాఠశాల ప్లేస్కూల్ క్లాస్ రూం నిర్మాణానికి గతంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.1.50 లక్షలు విరాళం అందించారన్నారు. నేడు బడి అభివృద్ధికి అనగాని రంగారావు జ్ఞాపకార్థం భార్య నాగమణి, కుమారులు మంత్రి అనగాని సత్యప్రసాద్, తెదేపా నేత శివప్రసాద్ రూ.1.50 లక్షలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. బాపట్ల, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, గుంటూరు జిల్లాల విద్యార్థులు తయారు చేసిన గణిత, సైన్స్ ప్రాక్టికల్ నమూనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. తెదేపా నేత అనగాని శివప్రసాద్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రామచంద్రరావు, రవిబాబు, నాగలీల, ప్రధానోపాధ్యాయిని రమాదేవి, కల్యాణి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 257.

కృష్ణా జిల్లాలో వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్షుడి నియామకం


సాయి యాదవ్

బాపట్ల అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సాయి యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర ఏఐఎస్‌యూ కార్యదర్శి మణి కొనియాడారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా సాయియాదవ్‌ను ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత అభినందనలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని గ్రామీణ గుంటూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా సి.హెచ్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పి.నాగరాజు, కోశాధికారిగా టి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎ.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఆర్.వి.సింగరయ్య, డి.సుబ్రహ్మణ్యం, ఎం.ఎస్.నాగేంద్రం, ఆరాధ్యుల దుర్గా కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులుగా టి.సాంబశివరావు, బి.మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొమిరిశెట్టి నాగేశ్వరరావు, వి.ఎస్.వి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివారున ద్విచక్ర వాహనాన్ని చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరుకు చెందిన బయ్యా పూర్ణేష్, ధూళిపాళ్ల సాయి హర్షవర్ధన్, చల్లగాలి వెంకటేష్ ద్విచక్ర వాహనంపై వేటపాలెం మండలం రామాపురంలో విద్యుత్తు పని చేసి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో గుంటూరు వెళ్తున్న వీరి మోటార్ సైకిల్‌ను పట్టణ శివారు ఎంఆర్ నగర్ వద్ద విజయవాడ నుంచి బాపట్ల వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వచ్చిన ఆటోను బస్సు డ్రైవర్ తప్పించే క్రమంలో ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వెంకటేష్‌ను మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో గుంటూరు సర్వజన ఆసుపత్రికి పంపించారు. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

REAL ESTATE

GENERAL

బాపట్ల SBI నుండి అంబేద్కర్ మార్గ్ వెళ్ళే దారిలో 4 3/4 సెం||ల్లో ఉత్తరం ఫేసింగ్ గల పాత ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్ర. 9885095025.

LAND FOR SALE

GENERAL

గుంటూరు పేరేచర్ల జోసిల్ మెయిన్‌రోడ్ దగ్గర 60అ|| తారురోడ్డు ప్రక్కన 120x460=1.25 సెంటు ఫెన్సింగ్, బోరు కలిగిన స్థలం అమ్మబడును. 7330916499.

PLOT FOR SALE

GENERAL

అమరావతి రోడ్డుకు, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు దగ్గరలో 700, 300 గజాల ఓపెన్ ప్లాట్ గులాబీ తోటతో సేల్. క్లియర్ టైటిల్.. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9010334569.

JOBS

Wanted area sales manager. Q:Inter/Degree. min exp 2Yrs in building material industry. S:30K-40K Ema Timbers, GNT. 9989920203.

విజయవాడలోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 9182513039.

WANTED
శ్రీప్రద లూబ్స్ & పెట్రో కెమికల్స్
AP+TG తెలుగు రాష్ట్రాలకు ఇండస్ట్రియల్ మరియు కమర్షియల్ ప్రొడక్ట్స్ ముఖ్యంగా MTO, Toluene, Hexane మార్కెటింగ్ కోసం B2B సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
అనుభవం: 2 TO 8 సం||లు B2B ఇండస్ట్రియల్ సేల్స్‌లో పై ప్రొడక్ట్స్ మార్కెటింగ్‌లో అనుభవం / కస్టమర్ పరిచయాలు ఉన్నవారికి ప్రాధాన్యత.
జీతం: 30,000 to 50,000+ ఇన్‌సెంటివ్స్+TA, DA.
దరఖాస్తుకు పూర్తి బయోడేటా మరియు మిగిలిన వివరాలు పంపించగలరు.
vishpt.edu@gmail.com
ఇంటర్వ్యూ Dates: 3-9-26, 4-9-26
టైం: 9 AM to 5 PM
Venue : సన్నిధి హోటల్
NRP రోడ్డు, గాంధీనగర్, విజయవాడ.
79812 56333
99890 77477

నరసరావుపేటలో పువ్వాడ హాస్పిటల్‌కు అప్తమాలజిస్ట్ డాక్టర్ గారు కావలెను. Contact: ✆ 9848214277.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు Junior /Senior Accountantగా పనిచేయుటకు పురుషులు కావలెను. విద్యార్హతలు : B.Com / M.Com, M.S. Office వయస్సు 30-45 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు ఫోన్ 8978480429.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుచ్చింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంఛార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం. సంప్ర. 4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

డెలివరీ బాయ్స్ & గర్ల్స్ (పార్ట్ టైం 5-6 గం||) సంపాదన 20K to 30K. ఆఫీస్ స్టాఫ్ (ఫుల్ టైం 10 గం||) లొకేషన్ : మంగళగిరి, తాడేపల్లి, నంబూరు, చిన్నకాకాని, వడ్డేశ్వరం, కురుగల్లు, ఫోన్ : 6304669595, లొకేషన్: సత్తెనపల్లి, పెద్దకురపాడు, సతులూరు, క్రోసూరు, రాజుపాళెం, మెడికొండూరు, ముప్పాళ్ల ✆ 7396569618.

SECURITY GUARDS
Wanted ex army Persons to work as Security Guards at Nambur - 8331029045.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మహారాజ్ఞిగా చందోలు బండ్లమ్మ



చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా 'మహారాజ్ఞి'గా భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని శ్రీబండ్లమ్మకు భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అల్లూరు గ్రామ దేవత శ్రీఅల్లూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవ్యాంధ్ర ఘంటసాల సాంస్కృతిక ప్రచారం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: సెప్టెంబరు ఒకటి నుంచి నవ్యాంధ్ర రాష్ట్ర స్థాయి ఘంటసాల సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని జనవిజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎకో హౌస్‌లో ఆదివారం ఘంటసాల చైతన్య పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఘంటసాల 25 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. బి.శరత్‌బోస్, జి.శ్రీనివాసరావు, టి.రామాంజనేయులు, కె.సుబ్బారావు, పి.సింగారావు, జ్యోత్స్న హస్మతార తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే భద్రత



జ్ఞాపిక అందుకుంటున్న చాందిని శ్రీ

బాపట్ల అర్బన్: ఆధునిక డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ దానికి తగ్గట్టుగా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటమే ప్రతి ఒక్కరికీ రక్షణ అని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గురజాల శ్రీనివాసరావు సూచించారు. బాపట్ల చీలు రోడ్డు సెంటర్‌లో ఉన్న ఎకో హౌస్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నిర్వహించారు. కార్యక్రమానికి డి.పి.డి.పి. ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, సీఈవో దండే యజ్ఞ నారాయణ, 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్ రూపకర్త చాందిని శ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మానవత స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో 'స్కాం వెబ్‌సైట్' పేరుతో ప్రదర్శించిన నాటిక సభ్యులను ఆకట్టుకుంది. దీనిలో భాగంలో దండే యజ్ఞనారాయణ కుటుంబ సభ్యుల సౌజన్యంతో 'మన ఆహారం.. మన ఇంటి వంటలు' పేరుతో ప్రతి ఒక్కరికీ ఉచితంగా 'బ్లాక్ రైస్ వెన్ పొంగల్' కిట్లను పంపిణీ చేశారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, మానవత యూత్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను జ్ఞాపికలు, మొక్కలతో సత్కరించారు. సంస్థ వైస్ ఛైర్మన్ తోట రామాంజనేయులు, కన్వీనర్ డాక్టర్ పి.హరిప్రసాద్, కోలా పద్మజ పాల్గొన్నారు.

ధర దక్కేన్.. దిగుబడి తగ్గెన్

ఆశ, నిరాశల మధ్య అరటి సాగుదారులు

కొల్లూరు, ఐలవరం, పెదపులివర్రు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే:

అరటి గెలలు మంచి ధర పలుకుతున్నాయని ఆనందించాలో, దిగుబడి సగానికన్నా తగ్గిందని బాధపడాలో తెలియని స్థితిలో లంక గ్రామాల రైతులు ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని వేలాది ఎకరాల లంక భూముల్లో దశాబ్దాలుగా అరటి సాగవుతోంది. ఇందులో కర్పూర అరటి రకం విస్తీర్ణం 90 శాతం పై మాటే. ఈ మధ్య కాలంలో ఎన్నడూ లేనంతగా ఒక్కో కర్పూర అరటి గెల గరిష్ఠంగా రూ.ఐదు వందల వరకు ధర పలుకుతోంది. అయినా ఈ పంట సాగు చేస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఎల్‌నినో కారణంగా ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణం. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నా వేసవిని తలపించే వేడి గాలులు వీస్తుండటంతో తోటల్లోని గెలలు కొంత మేరకే పక్వానికి వస్తున్నాయని వారు వాపోతున్నారు. దిగుబడి సగానికన్నా తగ్గడంతో కౌలు, పెట్టుబడులు చేతికి వస్తే చాలనుకునే దుస్థితి దాపురించింది.



భట్టిప్రోలులో వేలం పాటకు సిద్ధంగా గెలలు

తగ్గిన సాగు విస్తీర్ణం: అత్యంత సారవంతమైన కృష్ణా నది లంక భూముల్లో అరటి, పసుపు, కంద, బొప్పాయి, తమలపాకు లాంటి వ్యాపార పంటలు సాగవుతున్నాయి. ఐదేళ్లుగా కృష్ణానదికి వరుసగా వరదలు వస్తుండటంతో లక్షలాది రూపాయల వ్యయంతో పండించే ఈ పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతేడాది రెండు మండలాల్లో 1958 ఎకరాల్లో అరటి సాగు చేయగా ఈ ఏడాది ఇది 1110 ఎకరాలకు తగ్గింది. మిగిలిన వ్యాపార పంటలదీ ఇదే పరిస్థితి. ఈ పంటల దిగుబడి సైతం గణనీయంగా తగ్గేలా ఉందని అన్నదాతలు అంటున్నారు.

పెట్టుబడులైనా దక్కేనా: ఎకరా అరటి తోట సాగుకు పెట్టుబడి 75,000, కౌలు రూ. 50,000 కలుపుకొంటే రూ.1,25,000 వ్యయం అవుతుంది. ఎకరా తోటలో సాధారణంగా కనీసం 800 కర్పూర గెలలు పక్వానికి వస్తాయి. కానీ ఈ ఏడాది గరిష్ఠంగా సుమారు 350 గెలలు మాత్రమే పక్వానికివచ్చి, మిగిలినవి పనికి రాకుండా పోవడంతో కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేను సాగు చేస్తున్న రెండెకరాల అరటి తోటలో సుమారు ఆరువందల గెలలు పక్వానికి వచ్చి అమ్ముడయ్యాయి. మిగిలినవి పనికి రాకుండా పోవడంతో కౌలు, పెట్టుబడులు అంతంత మాత్రంగానే చేతికి వచ్చాయి. చాకిరి సైతం మిగల్లేదని కొల్లూరుకు చెందిన కౌలు రైతు **చందోలు అంకమరావు** వాపోయారు.

విద్యా రంగంలో 39 ఏళ్లుగా సేవలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా వేల మంది విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి వారి ఉన్నతికి కె.రమేష్ బాటలు వేశారని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా బాపట్ల పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. రమేష్‌ను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. నిజాంపట్నం ఎంఈవో శోభాచంద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి విశేష స్పందన

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ఆదివారం యజ్ఞ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేశారు. వైద్యులు యజ్ఞ శ్రీకాంత్, బెల్లంకొండ మాధవి, టి.ఎం. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసంపై ప్రణాళిక కీలకం

కంకటపాలెం, కొండుభట్లపాలెం, (బాపట్ల అర్బన్), న్యూస్‌టుడే:

ఎల్‌నినో ప్రభావం పశువుల పెంపకంపైనా ప్రభావం పడుతోంది. వర్షాలు సకాలంలో కురవక పచ్చిమేత కొరత ఏర్పడి, పోషణ భారంగా మారుతోంది. మేత కోసం పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో తిరుగుతున్న పశువులకు పచ్చిక అందుబాటులో లేకపోవడంతో గట్లపై ఉన్న పిచ్చి మొక్కలు తింటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇది పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడునాలుగు నెలల కిందట మార్కెట్‌లో తవుడు బస్తా(50 కేజీలు) ధర రూ.1400 ఉండగా ప్రస్తుతం రూ.1900 నుంచి రూ.2200 పెరిగింది. దీంతో పశువులకు పోషకాహారం అందించలేక పాల దిగుబడి తగ్గుతోందని కర్షకులు చెబుతున్నారు.

వర్షాభావంతో పచ్చిమేత పెరుగుదల గణనీయంగా పడిపోయింది. ముఖ్యంగా పశువులకు అత్యంత కీలకమైన నేపియర్, జొన్న, మొక్కజొన్న, కేవి వంటి మేత పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల పచ్చిమేత దొరకడమే కష్టంగా మారి, ఎండుగడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. తగినంత సరఫరా లేకపోతే పశుగ్రాసం, దాణా ధరలు ఆకాశాన్నంటే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పోషకాహార లోపంతో పశువుల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడం, ఎదదశ ఆలస్యంకావడం, గర్భధారణపై పరోక్షంగా దుష్ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని వెదుళ్లపల్లి పశువైద్యశాల అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.రేచల్ దివ్య సూచించారు. ఎల్‌నినోతో నీరు లేక వరి వేయకపోతే వరి గడ్డి లభ్యత తగ్గిపోతుంది. వరి గడ్డి సేకరణ, నిల్వలపై ముందస్తు ప్రణాళిక అత్యంత అవసరమని ఆమె వెల్లడించారు.



పొలంలో మేత మేస్తున్న పశువులు



పశువైద్యురాలు ఎం.రేచల్ దివ్య

రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు

బోర్ల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులు తక్కువ నీటితో పెరిగే జొన్న, మొక్కజొన్న వంటి పశుగ్రాసాలను సాగు చేసి నిల్వ చేయాలి. ఇందుకోసం ప్రభుత్వం 75 శాతం రాయితీతో విత్తనాలు, కిట్లను అందుబాటులో ఉంచింది. పచ్చిమేతను నిల్వ చేసుకునేందుకు మొక్కజొన్న, జొన్నలతో సైలేజ్ తయారు చేసుకుంటే ఎండాకాలం, వర్షాభావ సమయాల్లో పశువులకు మంచి ప్రత్యామ్నాయ మేతగా ఉపయోగపడుతుంది. ప్రభుత్వం సైలేజ్ తయారీని ప్రోత్సహించడంతో పాటు 50 శాతం రాయితీపై సమీకృత పశుదాణాను సరఫరా చేస్తోంది. కేవలం వరి గడ్డిపైనే ఆధారపడకుండా దానికి అదనంగా మినరల్ మిశ్రమాలు, సాంద్రీకృత దాణా అందించాలి. పాడి వాతావరణంలో పశువులకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. గ్రామ స్థాయిలోని పశువైద్య సిబ్బంది రైతులకు సైలేజ్ తయారీ, తక్కువ నీటి పశుగ్రాస సాగు, విత్తనాల వినియోగంపై నిరంతరం అవగాహన కల్పిస్తూ తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారని ఆమె తెలిపారు.



ఖాళీ స్థలాలు.. విష సర్పాలకు ఆవాసాలు

చందోలు, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని చందోలు, జి.ఎన్.పాలెం, ఖాజీపాలెం, భవనంవారిపాలెం, అల్లూరు తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడవిలా తయారయ్యాయి. చెట్లు గుబురుగా పెరగడంతో విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి. పగలు, రాత్రి అని లేకుండా వాటిల్లో నుంచి పాములు, విషపురుగులు, తేళ్లు గృహాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఒక్కోసారి తలుపులు తీయాలన్నా భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాపోతున్నారు.

కొంతమంది స్థల యజమానులు స్థలాల్లో ముళ్లపొదలు పెరిగినా పట్టించుకోవడం లేదు. దీన్ని పరిష్కరించమని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు ఇచ్చినప్పుడు ఆ స్థలాల వద్దకు అధికారులు వచ్చి చూసి, వెళ్తున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని ఆవేదన చెందుతున్నారు. స్థల యజమానులను పిలిపించి మాట్లాడటం లేదని వాపోతున్నారు. దోమల సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి, వాటిని శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో శేఖర్‌బాబు మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు అందించమని పంచాయతీ కార్యదర్శులకు చెబుతామన్నారు. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చందోలులో గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పెట్రోల్ బంకుల్లో గాలి గగనమే

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు మండలంలోని పెట్రోల్ బంకుల్లో ద్విచక్ర వాహనాలకు గాలి పెట్టుకోవాలంటే వాహనదారులకు గగనమవుతోంది. కూచిపూడి, పెదపూడి, గోవాడలోని నాలుగు బంకుల్లో గాలియంత్రాలు పనిచేయక అలంకార ప్రాయంగా మిగిలాయి. ఇంటూరు బంకులో యంత్రం పనిచేస్తున్నా.. గాలి పెట్టుకునేందుకు పిన్నులు పనిచేయక వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. టైర్లలో గాలి తగ్గి బంకులకు వెళితే అక్కడ నిరాశే ఎదురవుతోంది. ముఖ్యంగా రాత్రివేళ ప్రయాణించేవారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. టైర్లలో గాలి తగ్గితే ఎలా వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. ✦ అందని ఉచిత సేవ: నిబంధనల ప్రకారం ప్రతి బంకులో గాలి, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఉచితంగా అందాల్సిన ఈ సేవ యంత్రాలు మూగబోవడంతో ప్రైవేటు షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ ద్విచక్ర వాహనానికి రూ.20, ఆటో, కారులకు రూ.40 వసూలు చేస్తున్నారు. ✦ అధికారులు స్పందించాలి: యంత్రాలు అందుబాటులో ఉన్నా.. పనిచేయకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి, యంత్రాలకు మరమ్మతులు చేయించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దారు నెహ్రూబాబు మాట్లాడుతూ బంకు నిర్వాహకులతో మాట్లాడి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పనిచేయని గాలి యంత్రం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూ.49.50 లక్షలతో నిర్మించనున్న నూతన రైతు బజారు భవన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పనులు జరుగుతాయన్నారు. రైతులకు ఉచితంగా స్టాల్స్ కేటాయిస్తామని వివరించారు. వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పార్టీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు పాల్గొన్నారు.



భూమి పూజలో ఎమ్మెల్యే ఆనందబాబు

విద్యార్థి అదృశ్యంపై కేసు

చేబ్రోలు: కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం కావడంతో చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరనారాయణ కథనం మేరకు నారాకోడూరు గ్రామానికి చెందిన వి.యశ్వంత్ సాయిగోపీనాథ్ బాపట్లలోని ఓ కళాశాలలో డిప్లొమా విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం కళాశాలకు వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

11వ తేదీలోగా మీ ఓటును ధ్రువీకరించుకోండి

అమృతలూరు, న్యూస్‌టుడే: ఓటర్లు సెప్టెంబరు 11వ తేదీలోగా తమ ఓట్లను ధ్రువీకరించుకోవాలని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. ఆయన ఆదివారం ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో 2002లోని ఓటరు జాబితాతో ప్రస్తుత ఓటర్లను మ్యాపింగ్ చేసిన సమయంలో సుమారు 600 ఓటర్ల పేర్లు మ్యాపింగ్ కాలేదని తెలిపారు. వీరికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, అలాంటి ఓటర్లు తగిన ధ్రువీకరణలతో బూత్‌స్థాయి అధికారులను సంప్రదించి తమ పేరును ధ్రువీకరించుకోవాలని సూచించారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఉత్సవాలు ఆరంభం

నిజాంపట్నం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఆదివారం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు విరామం ప్రకటించి ఉత్సవాల్లో పాల్గొంటారు.



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు గ్రామదేవత దండి పార్వతి అమ్మవారు, అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఆర్య వైశ్య, యాదవ, గౌడ, వడ్డెర, పద్మశాలీయ, రజక సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ప్రదర్శనగా వెళ్లి అమ్మవారి చెట్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పొంగళ్లు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి సన్నిధిలో వరుణ యాగం



నగరం, న్యూస్‌టుడే: నగరం గ్రామంలోని శ్రీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో వారం రోజులుగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం వరుణ యాగం నిర్వహించారు. శ్రీవారికి 108 మంది భక్తులు 108 నివేదనలు సమర్పించి, ఆలయ ప్రదక్షిణలు చేశారు. వరుణ దేవుడు కరుణించి వానలు కురిపించాలని భక్తులు కోరారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



చీరాల

• చీరాల • పర్చూరు

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

వేటపాలెం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎంపీడీవో, ఏఈఆర్వో రాజారావు అన్నారు. ఆదివారం సర్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రామన్నపేటలోని పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితాను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, ఇంకా గుర్తించని ఓటర్ల వివరాలు బీఎల్వోని అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో బీఎల్వోలు, సిబ్బంది ఉన్నారు.



రామన్నపేటలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజారావు

వెలిగొండ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరి

మార్టూరు, న్యూస్‌టుడే: మార్కాపురం ప్రాంత ప్రజల వరప్రదాయనిగా పిలిచే వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం పర్యటించి పరిశీలించారని ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి సీఎం చంద్రబాబు పర్యటనపై పరిశీలన జరిపారన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలతో సాంబశివరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

పూలవారిపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: ? పూలవారిపాలెం 216-జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుపై వీధి దీపాలు వెలగడం లేదు. పాముల సంచారంతో రాత్రులు ఇబ్బందిగా ఉంది. సమస్య పరిష్కరించండి. - **శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి, సమస్య పరిష్కరిస్తాం.
- దాసరి సుధీర్‌కుమార్, గ్రామ కార్యదర్శి, చినగంజాం

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: ? పెదగంజాం పంచాయతీ పరిధి యానాది సంఘంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **ప్రసాద్, స్థానికుడు,** ✔ మూడు రోజుల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **- ఎం.ప్రసూన, గ్రామ కార్యదర్శి, పెదగంజాం**

వేటపాలెం, న్యూస్‌టుడే: ? నాయునిపల్లి శివాలయానికి వెళ్లే దారిలో ఉన్న మురుగు కాలువ చెత్త పేరుకుపోయింది. ఫలితంగా మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - **రాఘవరావు, స్థానికుడు** ✔ వెంటనే సిబ్బందిని పంపి, చెత్త తొలగించి, మురుగు సక్రమంగా వెళ్లేలా బాగు చేయిస్తాం.
- సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం

మార్టూరు, న్యూస్‌టుడే: ? మార్టూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ వీధిలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. - **రాంబాబు, మార్టూరు** ✔ పరిశీలించి చెత్త తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, ప్రత్యేక అధికారి** ? మార్టూరు ఎమ్మెస్సెన్ కాలనీలో మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా తయారైంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - **రమాదేవి, మార్టూరు** ✔ కాలువలు శుభ్రం చేసేలా సిబ్బంది ఆదేశిస్తాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- శ్రీనివాస్, ప్రత్యేక అధికారి

ఆలయ అభివృద్ధికి రూ.66 లక్షలు మంజూరు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లులోని పద్మాల అంకమ్మ ఆలయ అభివృద్ధికి రూ.66లక్షలు మంజూరైనట్లు ఇంకొల్లు గ్రూపు దేవాలయాల ఈవో దామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన ఆలయాన్ని తొలగించి ఆ స్థానంలో నూతనంగా ఆలయ పునర్నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థులకు రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసుకుని ఖాతాలో రూ.33లక్షల నిధుల నిల్వ చూపాలన్నారు. మట్టి గోడలతో ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని రాతి గోడలతో నిర్మిస్తారన్నారు. ఆలయ ప్రాంగణంలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న భోజనశాలను కూడా ఆలయ నిర్మాణం అనంతరం అభివృద్ధి చేస్తామని ఈవో చెప్పారు. గ్రామసభకు అతి తక్కువ మంది హాజరయ్యారు.

మొక్కజొన్న రైతుకు దైన్యం..
వ్యాపారులకు భోజ్యం

మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కలవకుదురు, న్యూస్‌టుడే

రైతన్నలు తమ కష్టాన్ని నమ్ముకుని విస్తారంగా సాగుచేసిన మొక్కజొన్న పంట దిగుమతులు దళారులకు భోజ్యంగా మారాయి. అన్నదాత ఇంటికి చేరే సమయంలో క్వింటా రూ.1650 పలికిన ధర వ్యాపారుల చేతుల్లోకి వెళ్లగానే రూ.2510 పెరగడం సాగుదారులను దిక్కులు చూసేలా చేస్తోంది. గతేడాది తొలినాళ్లలోనే క్వింటా రూ.2400-రూ.2700 పలికిన ధర ఈ ఏడాది ఏప్రిల్ పంట కోతల నాటికి ఒక్కసారిగా ధర పతనమై క్వింటా రూ.1650 నుంచి రూ.1700కి మధ్య మార్కెట్ మాయాజాలానికి నిదర్శనంగా నిలుస్తోంది. తెచ్చినచోట పెట్టుబడులు చెల్లించాలని వత్తిడి చేయడంతో ధర తక్కువ అయినా పండించిన పంటను కలాల్లోనే ఎక్కువ మంది తెగనమ్ముకోవాల్సిన దుస్థితి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో వ్యాపారులే రాజ్యమైంది.

రైతు నుంచి వెళ్లాక క్వింటా రూ.2510కి చేరిన ధర



ద్రోణాదుల వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

ఆయా ప్రాంతాల్లో.. మార్టూరు ప్రాంతంలోని ఏబీసీ కింద వేలాది ఎకరాల మాగాణి భూముల్లోనూ రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు ప్రాంత రైతులు బర్లీ పొగాకుకు ప్రత్యామ్నాయంగా దీని విస్తీర్ణాన్ని ఆరుతడి పంట కింద పెంచారు. నియోజకవర్గంలోని రైతులు ఈ ఏడాది రబీ కింద విస్తారంగా మొక్కజొన్నకు మొగ్గు చూపారు. మార్టూరు మండలంలో 11 వేలు, యద్దనపూడి-3597, పర్చూరు-5649, ఇంకొల్లు-5519, కారంచేడు మండలాల్లో 580 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగైంది. ఎకరాకు 30-32 క్వింటాళ్ల దిగుబడితో ఇంటి ముందు నిల్వలు పేరుకుపోయి దిగజారిన ధరలకు అమ్ముకునేలా పరిస్థితులు చేశాయి.

మార్కెట్ మాయాజాలం

రైతుల నుంచి మొక్కజొన్న పంట కొనుగోలు పూర్తయ్యాక సరకు వ్యాపారుల చేతికి వెళ్లగానే నెల రోజులకు క్వింటా ధర రూ.2510 పలకడం మార్కెట్ మాయాజాలానికి నిదర్శనం. రైతు దగ్గర ఉన్నప్పుడు పడిపోయిన ధరలు వ్యాపారులను వెళ్లగానే ఆకాశానికి ఎత్తాయని ఆవేదన చెందుతున్నారు. గతేడాది మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఇచ్చినా బహిరంగ మార్కెట్‌లో రూ.2700 ధర వరకు ఎగబాకడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించారు.

కొనుగోలు కేంద్రాలు చేయక

గ్రామాల్లో మొక్కజొన్న పంట కోతలు ఊపందుకున్న తరుణంలో విత్తనాలు క్వింటా రూ.2100 ధర పలికింది. ఏప్రిల్ మాసంలో ఒక్కసారిగా పంట నూర్పిళ్లు ముమ్మరం కావడంతో క్వింటా రూ.1750 రూ.1650 కుప్పకూల్చారు. అరకొర దిగుబడులతో తల్లడిల్లుతున్న మొక్కజొన్న రైతును పతనమైన ధరలు మరింత డీలా పడిపోయేలా చేశాయి. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 కల్పించేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించడంతో నియోజకవర్గంలోని రైతులు 72వేల ఎకరాలకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ సాగుకు మొగ్గు చూపారు.

బీటలు వారి.. కుంగిన రహదారి

అడుసుమల్లి(మార్టూరు, పర్చూరు), న్యూస్‌టుడే: గుంటూరు-ఒంగోలు పాత మద్రాసు రహదారిలో బీటీ దారి బీటలు వారి, కుంగిపోయి ప్రమాదాలకు దారితీస్తోంది. మండలంలోని అడుసుమల్లి వద్ద రోడ్డు అంచులు పలుచోట్ల దెబ్బతిన్నాయి. ఎదురు వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు అంచు చివరకు వెళ్లిన వాహనం ఒక్కోసారి అదుపు తప్పి ప్రమాదానికి కారణం అవుతోంది. దీంతో వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి రోడ్డు అంచులను పటిష్ఠం చేయాలని కోరుతున్నారు. లేదంటే వాహనాల విడి భాగాలు దెబ్బతింటాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యా రంగంలో 39 ఏళ్లుగా సేవలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా వేల మంది విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి వారి ఉన్నతికి కె.రమేష్ బాటలు వేశారని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా బాపట్ల పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. రమేష్‌ను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. నిజాంపట్నం ఎంఈవో శోభాచంద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపుతోనే సమస్యకు పరిష్కారం

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు ప్రాంత ప్రజలు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా మురుగు నీరు తప్ప మంచినీరు అందక అవస్థలు పడుతున్నారని నల్లమడ రైతు సంఘం నేత డాక్టర్ కొల్లా రాజమోహనరావు విమర్శించారు. ఆదివారం పర్చూరు ర.భ అతిథి గృహం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా గుంటూరు ఛానల్ పొడిగింపు ఓ కలగానే మారిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గుర్తించి భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. సమీపంలోని కృష్ణలో మంచి నీరు ప్రవహిస్తున్నా తమకు మాత్రం ఉప్పు నీరు, వాగుల్లో మురుగు నీరు తాగక తప్పడం లేదని వాపోయారు. 15రోజులుగా రైతులు దీక్ష చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరవైందన్నారు. అనంతరం పర్చూరు బొమ్మల కూడలిలో దేవరపల్లి రైతులతో కలిసి నిరాహార దీక్ష కొనసాగించారు. పర్చూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లోని 50 గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు ఈ ఛానల్ పొడిగింపు ద్వారా సమకూరుతుందన్నారు. 15వ రోజు దీక్షలో రైతులు కృష్ణమోహన్, భాస్కర్‌రావు, స్వాములు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, పెద్దసంఖ్యలో జనం పాల్గొన్నారు. వైకాపా నాయకుడు రావి రామనాథంబాబు సంఘీభావం తెలిపారు.



రైతులలకు సంఘీభావం తెలుపుతున్న వైకాపా నేత రామనాథంబాబు, రాజమోహనరావు

పశుగ్రాసం దగ్ధం రైతుకు ఆర్థిక నష్టం

ద్రోణాదుల(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని ద్రోణాదులలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి రూ.1.50లక్షల విలువైన పశుగ్రాసం దగ్ధమైనట్లు చీరాల అగ్నిమాపక అధికారి రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన పి.జయరావుకు చెందిన 10 ట్రక్కుల వరిగడ్డి వామికి మంటలు వ్యాపించడంతో కాలిపోయింది. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కొత్తపేట(వేటపాలెం) న్యూస్‌టుడే: కొత్తపేటలో ఉంటున్న ఆక్వారైతు చెరుకూరి లక్ష్మీనారాయణ ఇంటిపై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు రెండురోజుల క్రితం ఇనుపరాడ్లతో దాడిచేసి కిటికీల అద్దాలు, కారును ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, తనయుడు మహేంద్రనాథ్ ఆదివారం పరామర్శించారు. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల తెదేపా, జనసేన పార్టీల సమన్వయకర్త డాక్టరు పొగడదండ రవికుమార్, జనసేన నాయకులు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ షేక్ రియాజ్, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు ఆల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



దాడిలో ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వైకాపా నియోజకవర్గ బాధ్యుడు కరణం వెంకటేష్ బాధితుడిని పరామర్శించారు. దాడిచేసిన వారితో పాటు దీన్ని ప్రోత్సహించిన వారిని సైతం కఠినంగా శిక్షించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు గ్రామ దేవత శ్రీఅల్లూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణచేయగా 'ఆదిశక్తి'గా దర్శనమిచ్చారు.



వరుణుడి కరుణ కోసం ప్రత్యేక పూజలు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: వానలు సమృద్ధిగా కురవాలని గ్రామస్థులు కప్పలను కర్రలకు కట్టి వినూత్న రీతిలో పెళ్లి చేశారు. కారంచేడులో ఆదివారం చిన్నా, పెద్దలు పెద్దసంఖ్యలో చేరి వరుణుడి కరుణ కోసం విభిన్నంగా సందడి చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలో కప్పలను ఊరేగించారు. కరవు తీర వానలు పడాలని పూజలు చేశారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తి పంటలు సాగు చేయలేక పోవడంతో దశాబ్దాల నాటి కప్పల పెళ్లి ప్రక్రియను ఆచరిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. దీంతో కారంచేడులో ప్రత్యేక సందడి నెలకొంది. వాన కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కారంచేడులో..

అనంతవరం(యద్దనపూడి), న్యూస్‌టుడే: మండలంలోని అనంతవరంలో ఆదివారం గ్రామస్థులు వాన కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కొమ్ముబూరలు, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తిపూరిత వాతావరణం నెలకొంది.



అనంతవరంలో గ్రామస్థుల పూజలు

ఇరుకు దారి.. ఇబ్బందిగా మారి

రోడ్డు ఆక్రమణలతో అవస్థలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ముప్పవరం రహదారిలో ఇంకొల్లు పరిధిలోని గంగవరం మార్గంలో ఆక్రమణల కారణంగా రహదారి ఇరుకుగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలు పాటించకుండా నిర్మించుకున్న గృహాలు, అపార్టుమెంట్ల కారణంగా దారంతా మూసుకుపోయింది. నాలుగు అంతస్తుల భవనాలకు సెల్లార్లు లేక రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఇళ్ల ముందు రోడ్డు ఆక్రమించి నిర్మించిన మెట్లు, నూతనంగా గృహాలు నిర్మించుకునే వారు రహదారిపై పోసిన కంకర గుట్టలతో రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. వ్యాపార సంస్థల ముందు సరకులు దిగుమతి చేసే వాహనాలు గంటల తరబడి రోడ్డుపైనే నిలిచి ఉంటున్నాయి. ఉదయం, సాయంత్రం 50 పాఠశాల బస్సులు ఈ వైపు ప్రయాణిస్తాయి. జెండా చెట్ల కూడలి నుంచి శివాలయం వీధి మలుపు వరకు ఆక్రమణలు తొలగించాలి. ఉదయం సాయంత్రం సినిమా హాళ్ల కూడలి వైపు వన్‌వే ఏర్పాటు చేస్తే కొంత సమస్య తీరుతుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



గంగవరం మార్గంలో పరిస్థితి..

ఆ వైపు వెళ్లాలంటే.. కళ్లు మూసుకోవాల్సిందే!

దేగరమూడి(మార్టూరు), న్యూస్‌టుడే: మార్టూరు-పర్చూరు ప్రధాన రహదారి పక్కన గ్రానైట్ ముడిరాయి కోస్తుండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి దేగరమూడి వైపు వెళ్లే ర.భ. రహదారిలో కొందరు గ్రానైట్ రాళ్లను రోడ్డు వెంట కటింగ్ చేస్తున్నారు. దీంతో తెల్లటి దుమ్ము రేగడంతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డుపైనే ట్రాఫిక్ నిలిపి వాహనాల్లో రాళ్లను లోడింగ్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. నీటితో గ్రానైట్ రాయిని కోయాల్సి ఉండగా సంబంధిత గుత్తేదారు నిబంధనలు పట్టించుకోవడం లేదు. రాళ్లను అలాగే కోస్తుండడంతో దుమ్ము గాలిలో కలిసి ఎదురు వచ్చే వాహనాలు కనిపించకుండా ఆ ప్రాంతమంతా ఆవరిస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు, దేగరమూడి గ్రామస్థులు కోరుతున్నారు.




దేగరమూడి రోడ్డు వెంట ముడిరాయిని కోస్తున్న కూలీ

అల్లుకున్న నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని అడుసుమల్లి గ్రామంలో విద్యుత్తు స్తంభానికి ఆకుజాతి తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. గ్రామంలో ఓ స్తంభానికి కొద్ది నెలలుగా తీగలు అల్లుకోవడంతో విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడేలా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. వర్షం పడే సమయంలో వాటిని తాకితే విద్యుదాఘాతం జరిగే ప్రమాదం లేకపోలేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్తంభానికి ఉన్న తీగలను తొలగించి ప్రమాదాలు జరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-అడుసుమల్లి(మార్టూరు,పర్చూరు), న్యూస్‌టుడే



మరమ్మతులు ఎప్పుడో?

చీరాల మండలం రామకృష్ణాపురం నుంచి లక్ష్మీపురం వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. ముఖ్యంగా కుందేరు చప్టా నుంచి చీరాల - వేటపాలెం ప్రధాన రహదారి అనుసంధానం వరకు పలుచోట్ల అధ్వానంగా మారింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తూ అధికారులు మమ అనిపిస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. **- పేరాల, న్యూస్‌టుడే**



దంత సంరక్షణతోనే ఆరోగ్యం

రాజుపాలెం(మార్టూరు), న్యూస్‌టుడే: గ్రామీణులు దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ ప్రవల్లిక కోరారు. మండంలోని రాజుపాలెం, కేరాజుపాలెం జంట గ్రామాల్లో ఆదివారం మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 140 మంది దంత సంబంధిత వ్యాధులకు చికిత్స అందుకున్నారు. వైద్యులతో కలిసి తెదేపా నేత అడుసుమల్లి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు.. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేలా శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.



సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవల్లిక, తెదేపా నేత అడుసుమల్లి

లేగదూడల మృత్యువాత

పూనూరు(యద్దనపూడి), న్యూస్‌టుడే: మండలంలోని పూనూరులో ముగ్గురు రైతులకు చెందిన దూడలు చనిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. పొలంలో మేతకు వెళ్లిన నాలుగు దూడలు విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో చనిపోయి ఉండటాన్ని యజమానులు గుర్తించారు. వాటికి మందుపెట్టి చంపారని ఆరోపించారు. యజమానులు కోటేశ్వరరావు, బ్రహ్మయ్య, వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఊపందుకున్న విద్యుదీకరణ పనులు

ప్రమాద రహితంగా ఆధునిక హంగులు

మార్టూరు, న్యూస్‌టుడే

ప్రమాద రహిత, నూతన పరికరాలతో ఆధునిక విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. మార్టూరు పట్టణానికి కొంగొత్త హంగులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో భారీగా నిధులు కేటాయించి దశాబ్దాల నాటి శిథిల లైన్ల స్థానంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్తంభాలు, కండెక్టర్ (తీగలు), జంపర్లు వంటి వివిధ సామగ్రితో నిర్మిస్తున్న విద్యుత్తు లైన్లు ప్రత్యేకతను చాటుతున్నాయి.



మార్టూరులో ఏర్పాటు చేస్తున్న స్తంభాలు


అందివచ్చిన ఆర్డీఎస్ఎస్ పథకం

ఆర్డీఎస్ఎస్ పథకం కింద పట్టణంలోని వివిధ కాలనీలు, ప్రాంతాల్లో 2,500 స్తంభాలను తొలగించి వాటి స్థానంలో ఎత్తైన వాటిని ఏర్పాటు చేస్తున్నారు. 30ఏళ్ల క్రితం నిర్మించిన లైన్లలో చాలా వరకు కండెక్టర్ దెబ్బతినడమే కాక కొన్ని ప్రాంతాల్లో చేతికి అందేలా ప్రమాదకరంగా కిందకు చేరాయి. వరిగడ్డి ట్రాక్టర్లు, లారీలు వాటికి తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సంఘటనలు గ్రామస్థులు ఇప్పటికీ గుర్తున్నాయి. తుపాను గాలులు సమయంలో నేల కొరిగిన, పక్కకు వాలిన స్తంభాలతో తరచుగా ప్రమాదాలు తలెత్తుతున్నాయి.

మంత్రి, ఎమ్మెల్యే చొరవ..

ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించడంతో వీటన్నింటిని అధిగమిస్తూ ఈ ప్రాంతానికి చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో నూతన విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే మార్టూరు పట్టణం, వివిధ కాలనీల్లో సుమారు 900 స్తంభాల నిర్మాణం, కండెక్టర్ (తీగలు) ఏర్పాటు వంటి పనులు పూర్తయ్యాయి. పూర్తిస్థాయిలో విద్యుత్తు ఆధునీకరణ పనులు జరిగితే ప్రమాద రహిత కరెంటు సరఫరాకు మార్గం సుగమం కానుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పట్టపగలే వెలుగు.. పంచాయతీకి బిల్లులు



వరుసగా వెలుగుతున్న వీధి దీపాలు

వాడరేవు (చీరాల అర్బన్), రామకృష్ణాపురం, న్యూస్‌టుడే: ఈ చిత్రంలో మీరు చూస్తున్న దృశ్యం వాడరేవులోని లైట్‌హౌస్ రోడ్డులోనిది. ఆదివారం ఉదయం 12 గంటలు దాటినా ఆ మార్గంలో వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో పంచాయతీలకు విద్యుత్తు భారం మరింత పెరగనుంది. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి ఉదయం ఆరు గంటలలోపే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. అందుకు తగిన చర్యలు చేపట్టి పంచాయతీపై అధిక బిల్లుల భారం తగ్గేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి అట్లూరి మేరీజోన్స్ గారు
LFL, HM, విజయ్‌నగర్ కాలనీ, మార్టూరు

శ్రీ కొమ్ము విద్యాసాగర్ కెన్నెడీ గారు
LFL, HM, MPPS, HC
రాజుపాలెం

గత 40 సం॥లుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విధులు నిర్వర్తించి ఎంతోమంది విద్యార్థినీ, విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపి నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న శ్రీమతి అట్లూరి మేరీజోన్స్ గారికి, గత 32 సం.లుగా విద్యాబోధనలో విశేష సేవలు అందించి నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న శ్రీ కొమ్ము విద్యాసాగర్ కెన్నెడీ గార్లకు హార్దిక ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.

మాడుగుల కిషోర్, SA, BS అధ్యక్షులు, APTF బాపట్ల జిల్లా	Y. రాజారావు, SA, BS ఉపాధ్యక్షులు, APTF బాపట్ల జిల్లా	SK. జానీబాషా, SGT అధ్యక్షులు, APTF, మార్టూరు	ముప్పల సుబ్రహ్మణ్యం, SGT ప్రధానకార్యదర్శి, APTF, మార్టూరు
దొప్పలపూడి శ్రీనివాసరావు LFL, HM, MPPS, HE మార్టూరు	పాలపర్తి జయకుమార్ LFL, HM, MPPS, RJST	పల్లెపోగు శేషగిరిరావు SA, PS, ZPHS, దర్శి	అట్లూరి శ్యామ్‌బెంజిమెన్ Rtd SA SS, మార్టూరు
పొత్తూరి శివరామకృష్ణ SA PS, ZPHS, బొబ్బేపల్లి	దేవరకొండ రవీంద్రబాబు, SA BS, ZPHS, బొబ్బేపల్లి	సుంకర ఆదాము SA BS, KYNM, ZPHS, కొణిదెన	పరిమి ప్రసన్నకుమారి SA Hindi, ZPHS, కోనంకి
చెరుకూరి శ్రీరామమూర్తి HM, MPPS, (తండ) మార్టూరు	చింతల శ్రీనివాసరావు HM, MPPS, సమతనగర్, కోనంకి	తూబాటి రాఘవయ్య, HM MPPS, (AA), ద్రోణాదుల	తవ్వా అమరబాబు, HM MPPS, (Tank) వలపర్ల
కొప్రపాటి తిరుమలేశ్వరరావు, HM, MPPS, (AA), దర్శి	వల్లూరి కమలమ్మ, HM MPPS, GHనగర్, మార్టూరు	కసవరాజు సరోజ SGT, MPPS (HE) దర్శి	నాదెండ్ల శ్రీనివాసరావు, MPPS, (HE) బొబ్బేపల్లి
నెలకుర్తి ఆంజనేయులు, SGT MPPS, RJST, మార్టూరు	అట్లూరి ఛార్లీ బెంజిమెన్ SGT, MPPS (HC) రాజుపాలెం	బండారు రాంబాబు, SGT MPPS, P. చావిడి, మార్టూరు	దేవరకొండ రేణుకాంకమ్మ SGT, MPPS, జొన్నతాళి
కత్తి. మూసలయ్య, HM MPPS, (AA) జొన్నతాళి	శిఖా నాగేశ్వరరావు, HM MPPS, దేగరమూడి	మొండితోక లేవీ జోసెఫ్‌బాబు, SGT, MPPS, AA, మార్టూరు	తమ్మలూరి. ఆశాజ్యోతి SGT, MPPS, LE, బొబ్బేపల్లి

(c) eenadu